మమతల తల్లికి.. మహా నైవేద్యం



గొల్లప్రోలులోని దుర్గాడ శివాలయంలో లలితాదేవికి గురువారం 108 రకాల పిండి వంటలతో మహా భోగ నివేదన సమర్పించారు. –న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ




వాడపల్లిలో పందిరిరాట ముహూర్తంలో అర్చకులు, నాయకులు

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 21 నుంచి 29 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పందిరి రాట ముహూర్త కార్యక్రమం నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం, గోపూజ, ఇతర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. -న్యూస్‌టుడే, వాడపల్లి (ఆత్రేయపురం)

దసరాకు.. ధరాఘాతం

కొనలేనంత భారంగా నిత్యావసరాలు, కూరగాయలు



ఈనాడు, కాకినాడ: దుష్ట సంహారం కోసం ఆదిశక్తి తొమ్మిది రూపాలు ధరించిందని పురాణాలు చెబుతున్నాయి. అన్నప్రసాదాలంటే అమ్మ వారికి ప్రీతి.. అందుకే దసరా పర్వదినం వచ్చిందంటే ఆ సందడే వేరు. నవ రాత్రుల్లో ప్రతిరోజూ తొమ్మిది రకాల ప్రసాదాలు పెడుతున్నారు. ఇంకొందరు రోజుకో ప్రసాదంతో అమ్మకు నైవేద్యం అందిస్తారు. పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలతో శక్తి స్వరూపిణికి సమర్పించే నవ నైవేద్యాలకూ ధరాఘాతం తప్పడంలేదు. గత రెండేళ్లలో అన్నీ పెరిగాయి.


ఏరోజు ఏ నైవేద్యం పెట్టారంటే..

నవరాత్రుల్లో మొదటిరోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి బెల్లం పొంగలిని నైవేద్యంగా పెట్టారు. రెండోరోజు గాయత్రీ దేవికి ఉడకబెట్టిన పెసలు, పెసరపప్పు పొంగలి, పులిహోర.. మూడోరోజు అన్నపూర్ణకు దద్దోజనం, పాయసన్నం, పొంగలి, కొబ్బరి అన్నం పెట్టారు. ప్రస్తుతం 8వ రోజు దుర్గాదేవిగా అలంకరించి పాయసం, చక్కెర పొంగలి పెట్టారు. శుక్రవారం మహిషాసుర మర్ధినిగా వడపప్పు, పానకం, పులిహోర, పాయసన్నం.. శనివారం రాజరాజేశ్వరీ దేవికి పాయసన్నం, పులిహోర, కొబ్బరి, అరటి సమర్పిస్తారు. నైవేద్యానికి వాడే వస్తువులన్నింటి ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చొన్నాయి.

ఈ మూడేళ్లలో ప్రతి సెప్టెంబరులో ధరలిలా

సరకు (కేజీ)	2022	2023	2024
బియ్యం గ్రేడ్-1	52.40	58.50	62.00
బియ్యం గ్రేడ్-2	37.98	40.21	41.30
గోధుమ	39.60	41.70	43.50
కందిపప్పు	120.00	170.94	172.28
పెసర పప్పు	101.20	116.70	117.75
మినప	101.30	112.90	121.75
శనగ	71.50	82.50	107.63
వేరుశనగ	32.60	39.60	34.00

(ఇవి కాకుండా పసుపు 2022 సెప్టెంబరులో కిలో రూ.225 ఉంటే 2023లో 243, ఇప్పుడు 260 ఉంది. కారం రెండేళ్ల క్రితం కిలో రూ.310 కాగా గతయేడాది సెప్టెంబరులో 361, ఇప్పుడు 380 ఉంది. బెల్లం గతంలో రూ.47.80 ఉండగా ఇప్పుడు రూ.53.50)



భారమైనా.. భక్తితో..

పండగల వేళ కృత్రిమ కొరతలు సృష్టించడం.. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడం సాధారణమైంది. కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలు భారమయ్యాయి. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల ధరలకు బోలెడు వ్యత్యాసం ఉంటోంది. కీలక శాఖలు ఆశించిన రీతిలో దృష్టిసారించడంలేదు. ఈ పరిస్థితి కట్టడిచేస్తే అన్ని వర్గాలకూ కాస్త వెసులుబాటు దక్కేవీలుంది.

413 మద్యం దుకాణాలు 7597 దరఖాస్తులు



ఆన్‌లైన్ విధానాన్ని తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ చైతన్యకుమార్

పిఠాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 413 మద్యం దుకాణాలకు 7,597 దరఖాస్తులు వచ్చాయి. పిఠాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం డిప్యూటీ కమిషనర్ ఏసుగుల చైతన్యకుమార్ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా, ఏ దుకాణానికైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని.. శుక్రవారం వరకు గడువు ఉందన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఈనెల 14న లాటరీ ఉంటుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రేణుక, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మౌనిక, పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివరామరాజు పాల్గొన్నారు.

విదేశాల నుంచీ.. మద్యం దుకాణాల కోసం విదేశాల నుంచీ దరఖాస్తులు వస్తున్నాయి. తునిలో 20 దరఖాస్తులు అమెరికా నుంచి వచ్చాయి. పలు ప్రాంతాల్లో యూరప్ నుంచీ అందాయి. వారంతా ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకునే వీలుండటంతో ఉన్నచోటు నుంచే నమోదు చేసుకున్నారు.

మంత్రి పట్టుకుంటారు.. వీరు మిన్నకుంటారు

■ నాదెండ్ల తనిఖీల్లో వెలుగుచూస్తున్న రేషన్ అక్రమాలు ■ సాధారణ రోజుల్లో సిబ్బంది పరిశీలన అంతంతే

ఈనాడు, రాజమహేంద్రవరం: రేషన్ దందా అడ్డగోలుగా సాగుతున్నా.. పేదల బియ్యం విదేశాలకు తరలించేస్తున్నా పట్టని రీతిలో యంత్రాంగం ఉంటోంది. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీల్లో అక్రమ బియ్యం పట్టుబడుతున్నాయి. స్థానిక సిబ్బందీ ఇదేమాదిరి దృష్టిపెట్టి ఉంటే అక్రమార్కులకు ఎప్పుడో కళ్లెం పడి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి నాదెండ్ల ఆ తర్వాత నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లోని నాలుగు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 96,270 కిలోల అక్రమ బియ్యం నిల్వలు గుర్తించారు. మరి సాధారణ రోజుల్లో సంబంధిత సిబ్బంది ఎందుకు వీటి జోలికి వెళ్లడంలేదన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతోంది. మంత్రి మనోహర్ గత పర్యటనలోనూ కాకినాడ పోర్టులో ఇదే తరహాలో తనిఖీలు చేసి 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ నిల్వలు గుర్తించారు. అందులో దాదాపు 25 వేల క్వింటాళ్లు చౌక బియ్యం ఉన్నట్లు తేల్చారు.

జిల్లా	ఎండీయూలు	కార్డులు	సరఫరా చేసిన బియ్యం (కిలోలు)
తూర్పుగోదావరి	364	5,74,907	3,56,891
కాకినాడ	420	6,54,593	4,58,953
కోనసీమ	355	5,47,723	3,25,365

ఆఫ్రికా దేశాలకు..

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నల్లజర్ల-దేవరపల్లి మీదుగా చౌక బియ్యం లారీల్లో తరలుతున్నాయి. గతంలో విజిలెన్స్, ఇతర అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన బియ్యంపైనా సరైన నిఘా లేదు. దేవరపల్లిలోని వరలక్ష్మి మిల్లులో సీజ్ చేసిన 270 కిలోల రేషన్ బియ్యం ఉంచగా వాటిని దుర్వినియోగం చేసినా సిబ్బంది పట్టించుకోలేదు.



నల్లజర్లలో బుధవారం రాత్రి బియ్యం తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల

జిల్లాలో గుర్తించిన సీఎంఆర్ మిల్లుల్లో కొన్నేళ్లుగా సమర్థంగా తనిఖీలు లేవు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించేవారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన నిల్వలు, మిల్లింగ్ చేసి పంపిన బియ్యం, మిల్లు రోజువారీ కార్యకలాపాల రిజిస్టర్‌లు తనిఖీలు చేసేవారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఈతరహా తనిఖీలు మరుగునపడ్డాయి.

సొమ్ము ఇచ్చుకో.. పదోన్నతి పుచ్చుకో

■ పంచాయతీ ఉద్యోగుల బదిలీల్లోనూ కాసుల వేట ■ ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో వణుకు

ఈనాడు, కాకినాడ, రాజమహేంద్రవరం: జిల్లా, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో కొందరు ఉద్యోగుల లెక్కే వేరు. పదోన్నతులు, బదిలీలు, ఒప్పంద సిబ్బంది ఉత్తర్వులు, విచారణలు, అధికారుల పర్యటనలు ఇలా ఏ పని సాఫీగా సాగాలన్నా అడిగినంత సమర్పించాల్సిందే అన్నట్లుగా తయారైంది. తాజా పదోన్నతులు, బదిలీల్లో అక్రమ వసూళ్ల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. విచారణ జరిపించి నివేదికలు పంపాలని మూడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశించడంతో వ్యవహారం వేడెక్కింది.

వసూల్ రాజాలు ఎవరు..?

ఉమ్మడి జిల్లాలో గత నెలలో 55 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్- 2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించారు. ఒక్కొక్కరి దగ్గర్నుంచి రూ.18వేల చొప్పున వసూలు చేశారన్నది ఆరోపణ. గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 పదోన్నతులకు రూ.17వేల చొప్పున తీసుకున్నట్లు సమాచారం. ఆయా కార్యాలయాల్లో చక్రం తిప్పిన ఉద్యోగులు ఈ రేటు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ● కాకినాడ జిల్లాలో రాజకీయ వాసనతో ఉద్యోగం వెలగబెడుతున్న ఓ కీలక ఉద్యోగి.. ఏళ్లుగా పాతుకుపోయి ఇటీవల బదిలీ అయిన మరో ఉద్యోగి అక్రమ వసూళ్లలో చక్రం తిప్పారు.. కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చినా, అడిగినంత ఇస్తేనే ఇక్కడి వ్యవహారం సాగిందనే వాదనలూ వినిపిస్తున్నాయి. .● తూర్పుగోదావరి జిల్లాలో కొందరు తమకు నచ్చిన స్థానాల్లో కొలువుకు పరస్పర అంగీకారం, నాయకుల సిఫార్సు లేఖలతో పైరవీలు చేశారు. కార్యదర్శుల బదిలీల్లో పెద్ద ప్రహసనమే సాగింది. ప్రత్యేక అధికారుల పాలన, స్థిరాస్తి వ్యాపారం దండిగా జరిగి, ఆదాయం వచ్చే పంచాయతీల్లో పాగా వేసేందుకు ప్రయత్నాలు సాగాయి. ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకుల సిఫార్సు లేఖలతో పైరవీలు సాగించారు. ఇటీవల ఓ ఎమ్మెల్యే తాను 57 లేఖలిస్తే మూడింటినే ఆమోదించారని పేర్కొనడంపై చర్చ నడుస్తోంది. ● కోనసీమలో అంతర్గత బదిలీలు 86, ఇతర జిల్లాల నుంచి 17 మంది వచ్చారు. వీరి బదిలీల్లోనూ సిఫార్సులు, ఆమ్యామ్యాలు పనిచేశాయి.




భూ విక్రయాలకు సాఫ్ట్‌వేర్ కష్టాలు

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: నిత్య కల్యాణం.. పచ్చ తోరణంలా రద్దీగా ఉండే రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. సాఫ్ట్‌వేర్ సేవలు నెమ్మదించడంతో కక్షిదారులు పడిగాపులు కాస్తున్నారు. రోజుల తరబడి పనులు కావట్లేదని పలువురు వాపోతున్నారు. వేగవంతమైన సేవల కోసమని గత ప్రభుత్వ హయాంలో కార్డ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. అప్పటివరకు ఉపయోగిస్తున్న కార్డ్ 1.0ను ఆధునికీకరిస్తూ గతేడాది నవంబర్ 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దీన్ని ఉపయోగిస్తున్నారు. ఇలా ఉండగా సాంకేతిక సమస్యలతో సెంట్రల్ సర్వర్ ఇబ్బందులతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి.

అసలే పండగ రోజులు..

కార్డ్ 2.0 వెర్షన్ బాగుందని ఉన్నతాధికారులు చెబుతున్నా స్టాంపుల అమ్మకాలు, నాన్ జ్యుడిషియల్ స్టాంపులు, మార్కెట్ ఆధారిత ధ్రువపత్రాలను ఇప్పటికీ 1.0 వెర్షన్ ద్వారానే అందిస్తున్నారు. ఈనెల 4న సమస్య తలెత్తగా, నేటికీ పరిష్కారం కాలేదు. దీంతో వీటి విక్రయాలు నిలిచిపోయాయి. వారం రోజులుగా మార్కెట్ ఆధారిత ధ్రువపత్రాలు అందక, విపణిలో భూములు, స్థలాల విలువలు తెలియక రిజిస్ట్రేషన్లు వాయిదా పడుతున్నాయి. జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. పండగ సమయం కావడంతో మంచి రోజులుగా భావించి చాలామంది క్రయవిక్రయాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ తరుణంలో స్టాంపులు దొరక్క, పనులు జరగక కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 2.0 వెర్షన్ పనిచేస్తున్నా పూర్తి వివరాలు అందులో అప్‌డేట్ కాలేదు. సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



సర్వర్ నెమ్మదించడంతో ఆగిన కంప్యూటర్

ఆహా అనకముందే.. అయ్యో అనేలా..



యుద్ధ విమానం నమూనా

విద్యార్థులకు విజ్ఞానం, సందర్శకులకు ఆహ్లాదం పంచేలా 'కుడా' ఆధ్వర్యంలో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో టీయూ 142ఎం విమాన ప్రదర్శనశాలకు శ్రీకారం చుట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9.3 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. ఆపై గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పూర్తికాలేదు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా పనులు పూర్తికాకుండానే వైకాపా నాయకులు రిబ్బన్ కత్తిరించి, ప్రారంభించేశారు. ఆ తర్వాత రోజే మూసేశారు. చిన్నారులు ఆడుకొనే ఉద్యానం, గేమ్ జోన్‌లు పనులు ఆదిలోనే ఆగిపోయాయి. ముఖద్వారం, రహదారి విభాగిని పనులు నేటికీ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ



అసంపూర్తిగా ముఖద్వారం



పిచ్చి మొక్కల్లో క్రీడా పరికరాలు

దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దు

కాకినాడ కలెక్టరేట్: దళారులు, మధ్యవర్తులు, రైస్ మిల్లర్లను నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని జిల్లా సంయుక్త కలెక్టర్ రాహుల్ మీనా సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతుకు కనీస మద్దతు ధర అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకే మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ-పంటలో నమోదై ఈకేవైసీ పూర్తి చేసుకున్న ప్రతి రైతు నుంచి ధాన్యం సేకరిస్తామన్నారు. ఆధార్‌కు అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాకు సొమ్ము జమవుతుందన్నారు. రైతులే స్వయంగా గోనె సంచులు, రవాణా సమకూర్చుకుంటే ప్రభుత్వం ఛార్జీలు చెల్లిస్తుందన్నారు. జిల్లాలోని 277 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం నిర్ధారణ నమూనా పరిశీలించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్, అసిస్టెంట్ మేనేజరు(టెక్నికల్) వి.విజయ్‌రాజు, డీఎస్‌వో ఎంవీ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం నాణ్యత పరీక్ష పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

తాగునీరు, పారిశుద్ధ్య అవసరాల గుర్తింపు

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలోని 21 మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటి వసతి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక సర్వే నిర్వహించామని కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో లోపాలను గుర్తించామన్నారు. ప్రతి గ్రామానికి నోడల్ అధికారులను నియమించామన్నారు. తొలుత పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లోని గ్రామాలు, పిఠాపురం పురపాలక సంఘం, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో గుర్తించి నివేదిక ఇస్తారన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ సర్వే నిర్వహిస్తామన్నారు. వీటికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు.

చౌక దుకాణాలు.. కొత్తవి వస్తున్నాయహో..

జిల్లాలో 141 ఏర్పాటుకు నిర్ణయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్‌కార్డుల విభజన, కొత్త చౌక దుకాణాల ఏర్పాటు, దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న డీలర్ల భర్తీకి మార్గం సుగమమైంది. వివిధ కారణాలతో ఆలస్యమైన ఈ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు దస్త్రాలు సిద్ధం చేశారు. కార్డుదారులకు సమీపంలోనే చౌక దుకాణాలు ఉండాలన్న లక్ష్యంతో కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టారు. గ్రామాల్లో 400 నుంచి 450, పట్టణాల్లో 500 నుంచి 550, నగరాల్లో 600 నుంచి 650 వరకు ప్రతీ దుకాణంలో కార్డులు ఉండేలా పరిమితులు విధించారు. డీలర్ల వినతులను పరిగణనలోకి తీసుకుని రేషన్‌లైజేషన్ పూర్తి చేశారు. దీని ప్రకారం కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లలో కొత్తగా 141 చౌక దుకాణాల ఏర్పాటుకు నిర్ణయించారు.

ఎక్కడ ఎన్నంటే..

జిల్లాలో 21 మండలాల పరిధిలో అత్యధికంగా కాకినాడ గ్రామీణ మండలంలో 39, జగ్గంపేట, పెద్దాపురం మండలాల్లో 15 చొప్పున, కాకినాడ అర్బన్ మండలంలో 12 చొప్పున కొత్త దుకాణాలు రానున్నాయి. శంఖవరం, గండేపల్లి మండలాల్లో ఇప్పుడున్న వాటినే కొనసాగించనున్నారు. యు.కొత్తపల్లి, పెదపూడి, ఏలేశ్వరం మండలాల్లో ఒకటి చొప్పున, మిగతా మండలాల్లో 9 నుంచి 2 వరకు కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.

డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ తేదీ:	అక్టోబరు 20న
రాత పరీక్ష:	నవంబరు 5న
ముఖాముఖి:	నవంబరు 7న
నియామక ఉత్తర్వులు:	నవంబరు 10న
ప్రక్రియ పూర్తి:	నవంబరు 15లోగా
సరఫరా:	డిసెంబరు నుంచి

దీర్ఘకాలంగా ఇన్‌ఛార్జులతో నిర్వహిస్తున్న 133 చౌక దుకాణాలకు డీలర్లను నియమించనున్నారు. వీటిలో కాకినాడ అర్బన్‌లో అత్యధికంగా 30, తాళ్లరేవులో 16, సామర్లకోటలో 13, మిగతా 18 మండలాల్లో 8 నుంచి 1 వరకు ఖాళీలు ఉన్నాయి. కొత్తవి, ఖాళీగా ఉన్న చౌక దుకాణ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.



11 వరకు అభ్యంతరాల స్వీకరణ..

రేషన్ కార్డులను విభజించే 141 మంది డీలర్లకు నోటీసులిచ్చాం. 11 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తాం. కొత్తవి, ఖాళీల భర్తీ ప్రక్రియ ఆర్డీవోల ఆధ్వర్యంలో జరుగుతుంది. త్వరలో నోటిఫికేషన్ ఇస్తారు. దీనికి అనుగుణంగా పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తవి ఏర్పాటు, ఖాళీ భర్తీ ప్రక్రియ నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తాం.

- ఎంవీ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ

జిల్లాలో కొత్తవి, ఖాళీల వివరాలు..

రెవెన్యూ డివిజన్	ప్రస్తుత దుకాణాలు	కొత్త దుకాణాలు	ఖాళీగా ఉన్నవి
కాకినాడ	584	83	95
పెద్దాపురం	476	58	38

14న వినతుల స్వీకరణ రద్దు

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(వినతుల స్వీకరణ) కార్యక్రమాన్ని వివిధ కారణాలతో రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

రేషన్‌కార్డుకు మూడు పామాయిల్ ప్యాకెట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తోంది. అందులో వంట నూనెల విక్రయాలకు సంబంధించి ధరలు నిర్ణయించినట్లు డీఎస్‌వో ఎంవీ ప్రసాద్ గురువారం తెలిపారు. రేషన్‌కార్డు ఉన్నవారికి లీటరు పామాయిల్ ప్యాకెట్లు - మూడు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో ప్యాకెట్ రూ.110కు విక్రయిస్తారని వివరించారు. రేషన్‌కార్డుకు ఒక లీటరు సన్‌ఫ్లవర్ వంటనూనె ప్యాకెట్‌ను రూ.124కు విక్రయిస్తారన్నారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ఉల్లిపాయలు కిలో రూ.45, రూ.40, టమాటా కిలో రూ.40 చొప్పున రైతు బజార్లలో అమ్ముతారన్నారు. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈనెల 24 వరకు నిర్దేశిత ధరలకు అమ్ముతారన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో రీచ్‌లు, డీ-సిల్టేషన్ పాయింట్లు, డిపోలు ఉనికిలో లేవని, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆ జిల్లాల కలెక్టర్లతో చర్చించి, ఇసుక సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 257 మంది రవాణాదారులు వారి వాహనాల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణా, నిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో వినియోగదారుల నుంచి 497 బుకింగ్‌లు రాగా, 272 బుకింగ్‌లకు పంపిణీ చేశామన్నారు.

కాకినాడ ఏఆర్ అదనపు ఎస్పీ బదిలీ

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ ఏఆర్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న బి.సత్యనారాయణను బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన కృష్ణా జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా వెళ్లనున్నారు. ఇంటిలిజెన్స్ ఏఎస్పీగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావుని కాకినాడ ఏఆర్ అదనపు ఎస్పీగా నియమించారు.

రతన్ టాటాకు కడియంతో అనుబంధం

- ఇక్కడి బేరింగ్‌టోనియా మొక్కలంటే చాలా ఇష్టం
- నర్సరీ రైతు బిడ్డ మార్గాని వెంకటశేషుతో ప్రత్యేక మైత్రి

న్యూస్‌టుడే, కడియం

రతన్‌టాటాకు తూర్పు గోదావరి జిల్లా కడియపు లంక నర్సరీలతో విడదీయరాని అనుబంధం ఉంది. ఇక్కడి మొక్కలను ఆయన తన గ్రూప్ సంస్థ కార్యాలయాలతో పాటు.. తన నివాసంలోనూ విరివిగా ఏర్పాటు చేసుకున్నారు. అందులోనూ బేరింగ్‌టోనియా మొక్కంటే టాటాకు చాలా ఇష్టమని కడియం నర్సరీల రైతులు చెబుతున్నారు. ఇక్కడి నర్సరీ రైతు మార్గాని వీరబాబు 2023 జనవరిలో కుటుంబంతో సహా వెళ్లి రతన్‌టాటాను ఆయన నివాసంలో కలిశారు. మాట్లాడటానికి గంట అనుమతి కోరగా ఆ మేరకు అనుమతించారు. అయితే, వీరబాబు ప్రయాణించే విమానం ల్యాండింగ్ వైఫల్యంతో రెండున్నర గంటలు ఆలస్యంగా అక్కడికి వెళ్లారు. ఆ విషయాన్ని మాధ్యమాల ద్వారా తెలుసుకున్న రతన్ టాటా.. తన కోసం ఎంతో ప్రయాసపడి వస్తున్న వారి ఇబ్బందిని



రతన్ టాటాతో మార్గాని వీరబాబు కుటుంబం

తెలుసుకుని మరో గంట సమయాన్ని వీరబాబు కుటుంబం కోసం కేటాయించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం, వాటి పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. తదితరాలను అడిగి తెలుసుకున్నారు. కడియం నర్సరీల్లో బేరింగ్‌టోనియా మొక్కపై తన మక్కువనూ రతన్ టాటా వారికి వివరించారు. అలాంటి గొప్ప వ్యక్తి మృతి ప్రపంచానికి తీరని లోటని వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

● **మార్గాని వెంకటశేషుతోనూ ప్రత్యేక మైత్రి:** వీరబాబు కుమారుడు మార్గాని వెంకట శేషుకు రతన్ టాటాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన అభిరుచులకు అనుగుణంగా పర్యావరణ, ప్రకృతి, పశు పక్ష్యాదులకు సంబంధించిన అంశాలతో కొన్ని కోటేషన్లు తయారు చేసి టాటా వ్యక్తిగత ఈమెయిల్‌కు 2017 నుంచి పంపిస్తుండేవారు వెంకట శేషు. వాటిల్లో కొన్ని రతన్‌టాటాకు నచ్చడం.. ఆయన తిరిగి జవాబు ఇవ్వడం ప్రారంభించడంతో ఇద్దరి మధ్య మైత్రి మొదలైంది. ఆ క్రమంలోనే తన పుట్టిన రోజున తల్లిదండ్రులతో వెళ్లి టాటాను కలిసిన శేషు..



వెంకటశేషు గీసిన చిత్రంపై ఆటోగ్రాఫ్ ఇస్తున్న రతన్‌టాటా

తాను గీసిన చిత్రాలను ఆయనకు బహూకరించారు. మొత్తం మూడుసార్లు రతన్‌టాటాను కలిసే అదృష్టం తనకు కలిగిందని.. తాను బహూకరించిన చిత్రాన్ని తదేకంగా చూసి సంతోషపడ్డారని వెంకట శేషు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. చిత్రాన్ని గీయడానికి గల ప్రేరణ ఏంటనేది టాటా తనను అడిగి తెలుసుకున్నారని.. ఆయనకు డ్రైఫ్రూట్ లడ్డూలంటే చాలా ఇష్టమని వివరించారు. తానూ పలు సందర్భాల్లో ఆయనకు లడ్డూలు పంపించినట్లు వెంకటశేషు వివరించారు. ఈ ఏడాది జనవరిలో తాను కలిసినప్పుడు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. అనంతరం అనారోగ్యానికి గురవడంతో కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడానని.. చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన లేని లోటు తీరదని బాధ వ్యక్తం చేశారు.

వేతనాలు పెంచాలంటూ కార్మికుల ధర్నా

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని లంపకలోవ సమీపంలోని రొయ్యల పరిశ్రమం వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ ముందు కార్మికులు గురువారం ఆందోళన ప్రారంభించారు. వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ ముందు శిబిరం ఏర్పాటు చేసి ధర్నా చేస్తున్నారు. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోదరుడికి చెందిన ఈ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు కనీస వేతన చట్టం కింద జీతాలు చెల్లించడం లేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, కంపెనీ కార్మికులు దుళ్ల దుర్గాప్రసాద్, మణికంఠ నాయుడు, సునీల్, శెట్టి రాంబాబు, సందీప్, శ్రీను తదితరులు ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు. పెరుగుతున్న ధరలతో అరకొర వేతనాల వల్ల కుటుంబజీవనం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ ఎప్పటికప్పుడు చెల్లించాలని, కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏటా ఏప్రిల్‌లోనే వేతన ఒప్పందం చేయాలని, ప్రతి నెలా 5న చెల్లించాలని, జనవరి నెల వేతనంతోనే బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిభద్రత లేకపోగా ప్రశ్నించిన వారిని అంతర్గత బదిలీలతో వేధించడం అన్యాయమని సీఐటీయూ కార్యదర్శి ఈశ్వరరావు ఆరోపించారు. కార్మిక శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.



పరిశ్రమ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ ప్రతినిధులు

70వేల మందితో కుంకుమపూజ

సర్పవరం జంక్షన్: స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి గోశాల ప్రాంగణంలో గురువారం దేవీ నవరాత్రులు నిర్వహించారు. మహాశక్తియాగం 8వ రోజు ఐశ్వర్యాంబిక అమ్మవారికి బగళాముఖిదేవి అలంకరణ చేసారు. ప్రాంగణంలో సుమారు 70 వేల మంది అరుణవర్ణం చీరలు ధరించిన మహిళలచే కుంకుమార్చన నిర్వహించారు. శతకోటి కుంకుమార్చన గురువారానికి 90 కోట్లకు చేరిందని, దేశంలో మొదటి సారి 70 వేల మంది కుంకుమపూజలు నిర్వహించడం జరిగిందని స్వామీజీ తెలిపారు.




పూజల్లో పాల్గొన్న మహిళలు

కౌలు రైతులకు.. మంచి రోజులు..!

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

జిల్లాలో ఎక్కువమంది కౌలు రైతులే. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికం. బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందేందుకు వీరంతా నానా అవస్థలు పడుతున్నారు. సాగు ధ్రువీకరణ పత్రం (సీసీఆర్‌సీ కార్డు) ఉంటేనే రుణాలు, ఇతర లబ్ధి చేకూరేది. ఈ కార్డు పొందాలంటే భూయజమాని సంతకం, పొలం పత్రాలు అవసరం. ఇందుకు చాలామంది యజమానులు సహకరించకపోవటంతో కార్డులు పొందలేక పోతున్నారు. ఫలితంగా బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందట్లేదు. ఈ క్రమంలో కూటమి వీటిపై దృష్టి పెట్టింది. భూయజమానుల సంతకం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని మంత్రి మండలిలో నిర్ణయించారు.



వైకాపా నిబంధనలతో నానా తంటాలు..

గత తెదేపా ప్రభుత్వ హయాం(2014-19)లో రైతుల సంతకాలు లేకుండా కౌలుకార్డులు అందించేవారు. దీంతో కౌలుదారుల్లో 90 మంది ప్రయోజనాలు పొందేవారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిబంధనలు మార్చింది. భూ యజమాని అంగీకారం ఉంటేనే ఇస్తామని మెలిక పెట్టింది. పలు కారణాలతో అధిక శాతం భూ యజమానులు సంతకాలు పెట్టేందుకు, ధ్రువీకరణలు ఇచ్చేందుకు నిరాకరించటంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాంకు రుణాలు అందకపోవడం, రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకునే అవకాశం లేకపోవడం, పీఎం కిసాన్, రైతు భరోసా, రాయితీపై యంత్రాలు అందేవి కావు. కనీసం 60 శాతం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసిన పాపాన పోలేదు. గత్యంతరంలేక పలువురు అధిక వడ్డీకి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించేవారు.

రబీ నుంచి అమలుకు సన్నాహాలు..

కౌలు కార్డులు రబీ నుంచి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు. ఇటీవల ఏలూరు కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన జిల్లా సమీక్షలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి సైతం రబీ నుంచి కౌలు రైతులకు నేరుగా కార్డులు జారీ చేస్తామన్నారు. ఈ నిర్ణయంతో నేరుగా ప్రయోజనాలు అందనున్నాయి. కార్డులు రెవెన్యూ శాఖ ద్వారా కాకుండా వ్యవసాయ శాఖతోనే ఇవ్వనున్నారు.

మంచి నిర్ణయం..

వచ్చే రబీ నుంచి భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డుల జారీ నిర్ణయం మంచిదే. గతంలో చాలామంది కార్డులు అందక ఇబ్బంది పడేవారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

- ఎన్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ, కాకినాడ

నమామి దుర్గే



దుర్గాష్టమి సందర్భంగా గురువారం దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన పిఠాపురం పురుహూతికా అమ్మవారు

ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు: ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ నగరం: ప్రభుత్వం మారినా, పౌర సరఫరాల శాఖ అధికారుల తీరు మారలేదని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంజయ్‌నగర్‌లోని పౌర సరఫరాల శాఖ గోదాములను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం అక్కడ లోపాలపై విలేకర్లతో మాట్లాడారు. కాకినాడ పోర్టు పరిధిలోని అయిదు సార్టెక్స్ మిల్లుల్లో కార్యకలాపాలు ఆపేయాలంటూ 15 రోజుల క్రితం అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. దీంతో వారు ఆపేశారన్నారు. అదే ప్రాంతంలోని శ్రీచిత్ర ఆగ్రో ఎక్స్‌పోర్ట్ మిల్లు మాత్రం కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. ఈ మిల్లు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి చెందిన సామాజిక వర్గం వారిది కావడంతో అధికారులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అందరికీ ఒకే న్యాయం ఉండాలన్నారు. పౌర సరఫరాల శాఖ ఇప్పటికీ వైకాపా నాయకుల కనుసన్నల్లోనే పనిచేస్తుందని ఎమ్మెల్యే మండిపడ్డారు.



బియ్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

'లోపభూయిష్టంగా కేంద్ర పథకాల అమలు'

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో అమలవుతున్న కేంద్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయస్థాయి మానిటరింగ్(ఎన్‌ఎల్‌ఎం) బృందాన్ని పంపింది. కేరళలోని కొట్టాయంకు చెందిన సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ నుంచి ఎన్‌ఎల్‌ఎం ప్రతినిధులు టీవీ తిలకన్, సలిమాన్ ఈనెల 3 నుంచి 9 వరకు జిల్లాలో పర్యటించారు. డ్వామా, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, హౌసింగ్, విద్య, గ్రామ పంచాయతీ విభాగాలను వీరు పరిశీలించారు. గురువారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పథకాల అమలు కొంత లోపభూయిష్టంగా జరుగుతుందని, సరిదిద్దాలన్నారు. డ్వాక్రా సంఘాల పుస్తక నిర్వహణ సక్రమంగా జరగట్లేదన్నారు. బుక్ కీపింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద నిర్మించిన కొన్ని గృహాలకు సుమారు రూ.30 లక్షలు వెచ్చించారని, ఇంత స్తోమత ఉన్నవారికి ఈ పథకంలో ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. గ్రామాల సరిహద్దులపై సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. గ్రామీణ రహదారులను మరింత అభివృద్ధి చేయాలన్నారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, పరిపాలనాధికారి వర్ధనపు అబ్రహాం లింకన్, డీఆర్‌డీఏ డీపీఎం తోట అశోక్‌భరత్, పాల్గొన్నారు.



డ్వామా కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఎన్‌ఎల్‌ఎం బృందం

ఆదాయపు పన్ను చెల్లింపుదార్లతో ఆర్థికాభివృద్ధి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆదాయపు పన్ను చెల్లింపుదార్లు దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రధములని ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. నాగమల్లి జంక్షన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా భవనంలో గురువారం 'ఆదాయపు పన్నులు- వివాద్ సేవా విశ్వాస్ -2024'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా ఆదాయ పన్ను చెల్లించాలన్నారు. చెల్లింపులో చట్టపరమైన వివాదాలు ఎదుర్కొంటున్న వారు కేంద్రం ప్రవేశపెట్టిన వివాద్ సేవా విశ్వాస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అనురాధ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆదాయపు పన్ను సంయుక్త అధికారి బి.హేమభూపాల్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు తప్పనిసరిగా చెల్లింపుల పత్రాలను పరిశీలించాలన్నారు. సహాయాధికారి జి.తిరుపతిరావు మాట్లాడుతూ ఇందులో సీఏ పాత్ర కీలకమన్నారు. ఎస్ఐఆర్‌సీ వైస్ ఛైర్మన్ పీఎస్ఎన్ మూర్తి, ఎక్స్ అఫిషియో జి.నరేష్ చంద్ర, వి.రాధా, సీవీవీ గంగారామ్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



చక్రధరరావు ఏర్పాటుచేసిన స్టాల్‌లో చీరలను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ ఎం.బీనా

దిల్లీ చేనేత, హస్తకళల ప్రదర్శనలో తాటిపర్తి కార్మికుడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దిల్లీలో ఏర్పాటుచేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనలో గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు అంజూరి సుబ్రహ్మణ్య చక్రధరరావు స్టాల్‌ను ఏర్పాటుచేసి ఉప్పాడ, తాటిపర్తి, ఇతర చేనేత చీరలను ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా చేనేత, హస్తకళల ప్రదర్శనలో మొత్తం 26 స్టాళ్లను ఏర్పాటు చేయగా ఆంధ్రప్రదేశ్ నుంచి చక్రధరరావుకు చేనేత విభాగంలో అవకాశం కల్పించారు. ఈనెల 7వ తేదీన ప్రారంభమైన ప్రదర్శన 20వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. చక్రధరరావు ఏర్పాటుచేసిన స్టాల్‌లో వివిధ రకాల చీరలను భారత ప్రభుత్వ చేనేత మంత్రిత్వశాఖ అభివృద్ధి కమిషనర్ డాక్టర్ ఎం.బీనా, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత, రేఖారాణి తదితరులు ప్రదర్శనను తిలకించారు.

ఏపీ ఆర్‌సెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు

తిరుపతి (భైరాగిపట్టెడ): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్ 2023-24లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు సెట్ ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలోని 17 వర్సిటీల్లో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సుల్లో 2,566 పీహెచ్‌డీ ఖాళీలకుగాను తొలిదశలో ఫుల్‌టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1,237 మందికి సీట్ల కేటాయింపు చేపట్టినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో రిపోర్టు చేశాక సంబంధిత విశ్వవిద్యాలయాల్లో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు నేరుగా హాజరు కావాలని, వివరాలకు http://ets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడాలని కోరారు.

చోదకుడిని దారి మళ్లించి దోచుకున్న నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు హైవేపై సినీ తరహాలో ఘటన

ప్రత్తిపాడు: ఎన్‌హెచ్‌పై వెళ్తున్న వాహనాన్ని అడ్డగించి, చోదకుడిని దారి తప్పించి, భయపెట్టి సొమ్ములు గుంజుకునే ముఠా ప్రత్తిపాడు పోలీసులకు గురువారం చిక్కింది. సినిమా తరహాలో సాగిన ఘటనకు సంబంధించి సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాలిలా.. విజయనగరం పట్టణానికి చెందిన గొలగాని ఆదినారాయణ పశువుల లోడుతో వాహనంలో హనుమాన్ జంక్షన్‌కు వెళ్తుండగా మంగళవారం అర్ధరాత్రి 1.00 గంట ప్రాంతంలో అతని వాహనాన్ని ప్రత్తిపాడు హైవేపై నరేంద్రగిరి వద్ద కారులో వెంబడించిన ఐదుగురు వ్యక్తులు అడ్డగించారు. సమీపంలోని లంపకలోవ వెళ్లే రోడ్డుకు మళ్లించారు. అక్కడ మామిడితోటలో వాహన చోదకుణ్ని చంపుతామని బెదిరించి రూ.10వేలు లాక్కొన్నారు. అంతటితో వదలకుండా పశువులను బెండపూడిలో దింపి అదే వాహనంలో తెల్లవార్లు తిప్పించి తిరిగి బెండపూడిలో వదిలిపెట్టారు. ఎవరికి చెప్పినా చంపుతామని ఆదినారాయణను బెదిరించి ఉడాయించారు. దీంతో ప్రత్తిపాడు పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వడంతో సీఐ నేతృత్వంలో ఎస్సై లక్ష్మీకాంతం బృందం నిందితుల కోసం ముమ్మరంగా గాలించింది. ధర్మవరం కోల్డు స్టోరేజి వద్ద ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠాలో కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన కుంచె ఆనంద్ పరారీలో ఉండగా పిఠాపురం మండలం జల్లూరు గ్రామానికి చెందిన గున్నాబత్తుల శివ, విరవాడకు చెందిన కందా పాపారావు, పెద్దాపురం మండలం గోరింట గ్రామానికి చెందిన కలగా హరీష్, కర్రి శివలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.10వేలు నగదు, పశువులను, వారు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. వీరిలో హరీష్, శివలపై చీటింగ్ కేసులు ఉన్నాయన్నారు. బృందంగా కలిసి హైవేపై ఈ తరహా నేరాలను మొదలు పెట్టారన్నారు. ఈ కేసును సత్వరమే ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.



నిందితులు, వారి వాహనంతో ఎస్సై లక్ష్మీకాంతం

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

మహిళలను మోసం చేసిన నిందితురాలి అరెస్టు

సామర్లకోట: మహిళలకు మాయ మాటలు చెప్పి వారి వద్ద నుంచి బంగారు వస్తువులు తీసుకుని మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితురాలిని సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణభగవాన్ గురువారం వివరాలు వెల్లడించారు. సామర్లకోటకు చెందిన గంటా చెంగా (35) అనే మహిళ సామర్లకోట మండలం జి.మేడపాడు, రంగంపేట మండలం వీరంపాలెం పాకలు, శంఖవరం మండలం కత్తిపూడిలో మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని వారికి మాయమాటలు చెప్పింది. వారి వద్ద నుంచి బంగారు, వెండి వస్తువులు తీసుకుని మోసం చేసి తప్పించుకు తిరుగుతోంది. చెంగా తమను మోసం చేసిందని ఆయా పోలీసు స్టేషన్లలో బాధితులు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, సిబంది, సామర్లకోట క్రైం సీఐ అంకబాబు, సిబ్బంది దర్యాప్తు నిర్వహించారు. గురువారం చెంగాను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 34.8 గ్రాముల బంగారు వస్తువులు, 10 తులాలు వెండి వస్తువులను రికవరీ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు.



నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న సామర్లకోట సీఐ కృష్ణభగవాన్

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)



గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా - 40, వంకాయలు - 46,50,64, బెండకాయలు - 32, పచ్చిమిర్చి - 26,30, కాకరకాయ - 34, బీర - 40, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 40, దొండకాయలు - 30, బంగాళాదుంపలు - 30,34, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 34, ఆనబకాయ - 30,40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 100, చేమదుంపలు - 30,40, మునగకాడలు - 8,10, బీట్‌రూట్ - 36, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 120, అల్లం - 54, క్యాప్సికం - 70, బొబ్బర్లు - 46, చిలకడదుంపలు - 38, నిమ్మకాయలు(డజన్) - 24,54.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, జనక అయితే గనక, దక్షిణ, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, మా నాన్న సూపర్‌హీరో, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- మా నాన్న సూపర్‌హీరో, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సీఅండ్‌సీ 1- మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- విశ్వం, శ్రీశ్రీనివాసా(వేళంగి)- విశ్వం.

సారూ.. ఇక కదలాలి..

కుర్చీ వదలని ఇంజినీరింగ్ అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీ అయిన అధికారులు ఇప్పటికీ రిలీవ్ కాలేదు. గత వైకాపా పాలనలో అప్పటి స్థానిక ప్రజాప్రతినిధి సూచన మేరకు సుమారు రూ.100కోట్ల పనులకు జీహుజూరు అంటూ వీరు పనిచేశారు. ఎంతోకాలంగా పాతుకుపోయిన ఇంజినీర్లకు సాధారణ బదిలీల్లో స్థానచలనం చేసినా, కుర్చీలు ఖాళీ చేయట్లేదు. ఇక్కడ నుంచి ఇద్దరు ఈఈలను బదిలీ చేసినా, చాలా కాలం తర్వాత ఒకరు రిలీవ్‌కాగా, మరొకరు ఇంకా ఇక్కడే ఉన్నారు. నలుగురు డీఈఈలను బదిలీ చేసినా ఇప్పటికి ఒక్కరే రిలీవ్ అయ్యారు. ఇంకా ముగ్గురు ఖాళీ చేయట్లేదు. అయిదుగురు ఏఈలను బదిలీ చేయినా ఒక్కరూ రిలీవ్ కాలేదు. వీరి స్థానంలో ఇద్దరని మాత్రమే నియమించారు. ఏఈల కొరత ఏర్పడుతుందనే భావనతో అధికారులు వీరిని బదిలీ చేసేందుకు వెనుకడుగు వేస్తుండటం వీరికి వరంగా మారింది. ఇక్కడ పర్యవేక్షక ఇంజినీరుగా పనిచేసిన అధికారిణి బదిలీ జరిగిన పక్షం రోజులకు గానీ రిలీవ్ కాలేదు.

ఉద్యోగుల రిలీవ్‌కు ఉత్తర్వులు..

టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్య విభాగంలో కొందరు అధికారులను బదిలీ చేయగా, ఒకరు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో నియమించిన అధికారి ఇంకా రాలేదు. బదిలీ అయిన అధికారులందరినీ తక్షణం రిలీవ్ చేయాలని గురువారం పురపాలక శాఖ కమిషనర్ నుంచి నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఇవి వర్తిస్తాయని దీనిలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బదిలీ జరిగి స్థాన చలనం పొందని ఇక్కడి అధికారులు, ఇంజినీర్లు రిలీవ్ కాకతప్పని పరిస్థితి నెలకొంది. దీన్ని కూడా ఆపుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మున్సిపల్ ఉద్యోగులే పేర్కొంటున్నారు.



భానుగుడి శివాలయంలో..



అశోక్‌నగర్ శిర్డీసాయి ఆలయంలో..



మెయిన్‌రోడ్డు రామాలయంలో..



బాలాత్రిపుర సుందరి అమ్మవారు,



ఆలయంలోని క్యూలైన్లలో భక్తుల రద్దీ



ఎస్.అచ్యుతాపురంలో జ్యోతుల ఊరేగింపు

దుష్ట సంహారిణి.. దురిత నివారిణి



పెద్ద శివాలయంలో..

గాంధీనగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకుని నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల్లో అమ్మవారి బోనాలు, కలశలతో భారీ ఊరేగించారు. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. అమ్మవారిని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నారాయణరావు దంపతులు దర్శించుకున్నారు. సంతచెరువు కనకదుర్గాదేవి ఆలయంలో మహిళలు కుంకుమార్చనలు చేశారు. అమ్మవారు కాళికాదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద శివాలయంలో అమ్మవారిని చాముండేశ్వరిదేవిగా అలంకరించారు. గాంధీనగర్‌లోని మార్కెట్ వద్ద గల కనకదుర్గ ఆలయం, మాధవనగర్‌లోని శ్రీకనకదుర్గా ఆలయం, భానుగుడి సెంటర్‌లోని ఉషాబాలాత్రిపుర సుందరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గాదేవిగా అమ్మను అలంకరించారు. మధురానగర్ ఎస్.అచ్యుతాపురం యూత్ ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గ మందిరం నుంచి మహిళలు, యువతులు బోనాలు, కలశలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. యాళ్లవారి వీధి, సూర్యనారాయణపురం, రంగయ్యనాయుడు వీధి, రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాంబమూర్తినగర్: నగరంలోని గొడారిగుంట సత్తెమ్మతాడి వద్ద అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కొన్నివేల మంది అంధులు కార్నియాలు లేక చీకట్లోనే ఉండిపోతున్నారని బాదం బాలకృష్ణ ఐబ్యాంకు కార్యదర్శి బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. వారికి వెలుగులు ప్రసాదించాలంటే మరణానంతరం ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని సూచించారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ఆవరణలో గురువారం కాకినాడ లయన్స్‌క్లబ్ సభ్యులు పలువురు నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు. ఆ పత్రాలను బాదం బాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను అంధత్వ రహిత జిల్లాగా మార్చాలని, ఇప్పటివరకు తమ ఐబ్యాంకు ద్వారా 7,146 కార్నియాలను సేకరించి, ఉపయోగించామన్నారు. ట్రస్టీలు జీవీఎస్.గౌరీశంకర్, సభ్యులు మోహన్‌కుమార్, సుబ్బారావు, పద్మజులు, కుమార్, జగన్నాథరావు, నాగలక్ష్మి, అనుపమ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

36 మద్యం దుకాణాలకు.. 420 దరఖాస్తులు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ నగర పరిధిలోని 36 మద్యం దుకాణాలకు గురువారం వరకు 420 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం ఆఖరి రోజు కావడంతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. తొలుత 9వ తేదీ వరకే గడువు ఉండగా దరఖాస్తుదారుల అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచింది. నగరంలోని నార్త్ ఎక్సైజ్ స్టేషన్‌లో 17 మద్యం దుకాణాలు, సౌత్ స్టేషన్‌లో 19 దుకాణాలు కలిపి మొత్తం 36 మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. ఇందులో 15వ నంబరు దుకాణానికి అత్యధికంగా 23, 5, 32 నంబర్ల దుకాణాలకు అత్యల్పంగా చెరో ఎనిమిది చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కాకినాడ సౌత్, నార్త్ పరిధిలోని నగర, రూరల్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 848, పిఠాపురంలో 216, తాళ్లరేవులో 345, పెద్దాపురంలో 209, ప్రత్తిపాడులో 264, తునిలో 204 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి తెలిపారు. శుక్రవారంతో గడువు ముగుస్తుందన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కాకినాడ నార్త్ ఎక్సైజ్‌స్టేషన్ సీఐ రామ్మోహనరావు

తర్జనభర్జన..

దరఖాస్తుకు రూ.రెండు లక్షలు డీడీ తీయాల్సి రావడంతో అంత మొత్తం కట్టలేక దరఖాస్తులు తక్కువ వచ్చినట్లు సంబంధిత సిబ్బంది చెబుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి దరఖాస్తు చేస్తే లాటరీలో దుకాణం వస్తుందో.. రాదో అనే భయంతో తర్జనభర్జన పడుతున్నారు. ఒకవేళ వచ్చినా రెండేళ్ల పాటు ఆ దుకాణం నడపాలంటే పలు సమీకరణాలు కూడా కలిసిరావాలి. వాటిని కూడా బేరీజు వేసుకుని ఆచితూచి అడుగు వేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కొంతమంది వెనుకడుగు వేస్తున్నారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అంత మొత్తం వెచ్చించలేక, స్థానిక పరిణామాల నేపథ్యంలో పలుచోట్ల సిండికేట్ అవుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందనే వాదన వినిపిస్తుండగా, అలాంటిదేమీ లేదని, అంతా పారదర్శకంగా జరుగుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: లింగ వివక్షను రూపుమాపేందుకు, మహిళా సాధికారత కోసం పోరాటం అనేవి అంతర్జాతీయ బాలికా దినోత్సవం లక్ష్యమని డీఎంహెచ్‌వో డా.నరసింహనాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జిల్లాలో శుక్రవారం నిర్వహిస్తామన్నారు. బాలికల హక్కుల ఉల్లంఘనను వ్యతిరేకించి ప్రపంచవ్యాప్తంగా ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి తెలియజేసేందుకు 2012 నుంచి ఏటా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ లక్ష్యమన్నారు. చట్టం ఆవశ్యకత, చట్టపరిధిలో నేరాలు, శిక్షల తదితర వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టు విజేతగా కాకినాడ

పిఠాపురం: ఉలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్విటేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంటు గురువారం నిర్వహించారు. చంటి, సాయి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది జట్లకు ఆహ్వానం అందింది. ఫైనల్‌లో కాకినాడ, ఉలపల్లి జట్లు తలపడగా కాకినాడ జట్టు విజయం సాధించింది. ద్వితీయస్థానంలో ఉలపల్లి, తృతీయస్థానంలో రాజమహేంద్రవరం నిలిచాయి.

పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

సర్పవరం జంక్షన్: ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. కాకినాడ బోటు క్లబ్ వద్ద కృషి భవన్‌లో ఓటరు నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు.

ఉచిత అంబులెన్స్ సేవలు

కాకినాడ ఖిద్మత్ కమిటీ గురువారం ఉచిత అంబులెన్స్ సేవలు పునఃప్రారంభించింది. కొవిడ్ సమయంలో సేవలు అందించింది. ఈ వాహనంలో మరిన్ని సదుపాయాలు కల్పించగా మున్సిపల్ కమిషనర్ భావన జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కమిటీ సేవలు అభినందనీయమన్నారు. కమిటీ అధ్యక్షుడు చిష్టి మాట్లాడుతూ నగరంలో మానసిక రుగ్మతలతో బాధపడుతూ వీధుల్లో అనాథులుగా తిరుగుతున్న వారిని గుర్తించి, సపర్యలు చేస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించడానికి, పార్థివదేహాలను శ్మశాన వాటికలకు తీసుకెళ్లడానికి అంబులెన్స్ వినియోగించుకోవచ్చన్నారు. 9849223178కు ఫోన్ చేయాలన్నారు. సభ్యులు అలీమ్, హసన్ షరీఫ్, రాజు, మస్తాన్, ఫరూక్, బాషా, తాజుద్దీన్, కరీంఖాన్, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు, ఎండీ సైపుల్లా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్, సాంబమూర్తినగర్



జెండా ఊపి వాహనం ప్రారంభిస్తున్న కమిషనర్ భావన

కష్టంతో కాదు ఇష్టంతో పనిచేద్దాం

పని ప్రదేశాల్లో ఒత్తిడిని జయించేందుకు ఉద్యోగులంతా కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జీజీహెచ్ ఎస్‌పీఎం గ్యాలరీలో మానసిక వైద్యనిపుణుడు డా.వరప్రసాద్ అధ్యక్షతన అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా సూపరింటెండెంట్‌తో పాటు ఆర్ఎంసీ వైస్‌ప్రిన్సిపల్స్ డా.ఎ.విష్ణువర్ధన్, డా.శశిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానసిక సమస్యలు తలెత్తితే అశ్రద్ధ చేయొద్దని వెంటనే నిపుణులను సంప్రదించాలన్నారు. పని ప్రదేశంలో ఒత్తిడి, అనారోగ్య లక్షణాలు, వాటి చికిత్స, నివారణ గురించి తెలియజేశారు. జీజీహెచ్ మానసిక వైద్యవిభాగాధిపతి డా.రామచంద్రరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.శాంతి, అఖిల, వైద్యాధికారులు, నర్సింగ్, సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్



మాట్లాడుతున్న జీజీహెచ్ మానసిక వైద్యుడు వరప్రసాద్

ప్రజా పారిశ్రామికవేత్త రతన్ టాటా

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతితో భారతదేశం ఒక దిగ్గజాన్ని కోల్పోయిందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆయన మృతిపై స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కొండబాబు, పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. తన సంస్థల ద్వారా వేలమందికి ఉపాధి చూపారన్నారు. కరోనా సమయంలో భారీ విరాళాన్ని అందించి దేశానికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందన్నారు. నగర తెదేపా అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు డా.కొండమూరి సత్యనారాయణ, తుమ్మల రమేష్, వమ్మి బాలాజీ, గుమ్మళ్ల చిన్న, పిన్నమ్మరెడ్డి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ నగరం



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

సంప్రదాయ చేతివృత్తిదారులకు చేయూత

కాకినాడ కలెక్టరేట్: విశ్వకర్మ యోజన పథకం ద్వారా సంప్రదాయ చేతివృత్తిదారులకు చేయూత అందించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ భావన తెలిపారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ పథకానికి వివిధ చేతివృత్తిదారులు 2,748 దరఖాస్తులు చేశారని, వీటిని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి, అర్హులను గుర్తించాలని ఆదేశించారు. వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పరిశీలన చేయించాలన్నారు. వృత్తి నైపుణ్య కళాకారులు, సంప్రదాయ కుటుంబ వృత్తులను గుర్తించి ఆమోదించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం చేపట్టిన ప్రక్రియను ఆరా తీశారు. సమావేశంలో టీపీఆర్వో కె.శైలజ, సిటీ మిషన్ మేనేజరు డి.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలోకి అనుమతించాలని వినతి

కాకినాడ కలెక్టరేట్: సురేష్‌నగర్ పార్కులోని ధ్యాన మందిరంలో కార్యకలాపాలకు అనుమతించాలని గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భావనను స్థానికులు కోరారు. ప్రతిరోజూ రెండు గంటలు ఇక్కడ ధ్యానం చేసేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

సాంబమూర్తినగర్: కాకినాడ ఆర్టీసీ బస్టాండులో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన సమస్యలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. పండూరు జంక్షన్ వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయం దగ్గర బస్సులు ఆపట్లేదని కాకినాడకు చెందిన ప్రసాద్, రామకృష్ణలు ఫిర్యాదు చేశారు. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు బస్సులు నడపాలని మోహన్ కోరారు. జమునానగర్ కాలనీ వద్ద బస్సులు ఆపట్లేదని కాకినాడకు చెందిన సుబ్బారావు ఫిర్యాదు చేశారు.

నలుగురికి రెండ్రోజుల జైలు

మసీదు సెంటర్: ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1, 2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 11 మందిపై కేసులు నమోదు చేశామని సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రెండ్రోజుల జైలు, మరో 7 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు గురువారం తీర్పు ఇచ్చారు.

టిడ్కో చెంత.. సమస్యల చింత

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ నగర శివారు పర్లోపేట వద్ద గల టిడ్కో గృహాల చెంత సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ 36 బ్లాకులు ఉండగా, ఒక్కో దాంట్లో 32 చొప్పున 1,152 ప్లాట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 800కు పైగా కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. నిర్వహణ లేకపోవడంతో బ్లాకుల మధ్య చెత్త, పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వర్షం పడితే బ్లాకుల మధ్య బురద చేరుతోంది. కాలువలు సరిగా శుభ్రం చేయట్లేదని, దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల మ్యాన్‌హోల్స్‌కు మూతలు లేక ప్రమాదకరంగా ఉన్నాయి. రెండు, మూడు చోట్ల స్థానికులే ప్రమాద సూచికగా కర్రలు, అట్టలు, రాళ్లు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవట్లేదని వారు వాపోతున్నారు. చివర బ్లాకుల వద్ద వీధి దీపాలు లేవు. విద్యుత్తు స్తంభాలున్నా దీపాలు ఏర్పాటు చేయలేదు. దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బ్లాకుల మధ్య బురద, మురుగు

ఇబ్బందులు పరిష్కరిస్తాం..

ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. సాయంత్రం దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే బ్లాకుల మధ్య బురదమయంగా మారుతోంది. నీరు పారే మార్గం లేక తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు ఇక్కడి సమస్యలు పరిష్కరించాలి. – ఎన్.రమేష్, స్థానికుడు

ప్రమాదమైనా పట్టించుకోరా..

విద్యుత్తుకు సంబంధించిన ఎలాంటి విషయమైనా ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఏ చిన్న తప్పు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. నగరంలోని చాలా ప్రాంతాల్లో నియంత్రికల వద్ద ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటికి తలుపులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, పాఠశాలలు, ఉద్యాన వనాల వద్ద బాక్సులు చేతికందే ఎత్తులో ఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్



గొడారిగుంట సీతారామ్‌నగర్ వద్ద..



డెయిరీఫారం కూడలి రాజీవ్ గృహకల్ప వద్ద..

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద 16న నంబరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్.రాయవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ నాన్ స్టాప్ బస్సు 36 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. పెనుగొల్లు వద్ద ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరానికి చెందిన బస్సు డ్రైవర్ ఎం.తాతాజీ, విశాఖపట్నానికి చెందిన ఐ.ఎస్.ఎన్.రాజు, ఒడిశాకు చెందిన కె.చంద్ర సబత్, రంజన్ పంగి తలకు గాయాలయ్యాయి. కాకినాడకు చెందిన రత్నకుమార్, వరప్రసాద్, వైజాగ్‌కు చెందిన మురళీకృష్ణ, నూకరత్నం, ఉమామహేశ్వరి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని నక్కపల్లి సామాజిక ఆసుపత్రి, పెనుగొల్లు ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖకు తరలించారు. రోడ్డు మధ్యలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.



ప్రమాదానికి గురైన వాహనం

ఉపాధికి వచ్చి.. ఊపిరి ఆగి

వేర్వేరు వాహన దుకాణాల్లో ఇద్దరు దుర్మరణం

మసీదుసెంటర్: వారిద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందినవారు. కుటుంబానికి అండగా ఉండేందుకు చిన్న వయసులోనే పనిలో చేరారు. వాహన దుకాణాల్లో పనిచేస్తున్నారు. ఒకరు విద్యుదాఘాతంతో చనిపోగా, మరొకరు కారు ఢీకొని దుర్మరణం చెందారు. ఈ రెండు ఘటనలు వేర్వేరు వాహన దుకాణాల్లో ఒకేరోజు జరగడంతో విషాదం నెలకొంది.

- కాకినాడ మహాలక్ష్మినగర్‌కు చెందిన పాలెపు మహేష్ వర్మ(22) త్రీటౌన్ పరిధిలోని ఓ ద్విచక్రవాహనాల షోరూంలో పనిచేస్తున్నారు. బండిని కడుగుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.
- ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్‌కు చెందిన యాకుబ్ (20) కాకినాడ గ్రామీణంలోని కార్లు శుభ్రం చేసే ఓ వాష్ షోరూంలో పనిచేస్తున్నాడు. వాహనం కడుగుతుండగా కొంచెం అనువుగా ఉండేందుకు కారును కొంచెం ముందుకు జరపమన్నాడు. దాన్ని నియంత్రించడంలో విఫలమవ్వడంతో కారు యాకుబ్ ఛాతిని బలంగా ఢీకొంది. తీవ్రగాయాలవ్వడంతో చికిత్సనిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. దీనిపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మురుగుతో అవస్థలు..

కాకినాడ పెదమార్కెట్ ప్రధాన రహదారి పక్కన కాలువలో మురుగు రహదారిపైకి వస్తోంది. అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, దోమలతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానిక దుకాణదారులు, ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువలో పూడిక తీసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



పగలు వెలుగులు.. రాత్రి చీకట్లు..



నగరంలోని వెంకట్‌నగర్‌లో పగలు వీధిదీపాలు వెలుగుతున్నాయని, ప్రజాధనం వృథా చేస్తున్నారని నగరవాసులు వాపోతున్నారు. శ్రీనగర్‌లోని ఓ వీధిలో రాత్రి దీపాలు వెలగక చీకట్లు అలముకుంటున్నాయి. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, రాకపోకలు సాగించేందుకు భయందోళనకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
సాంబమూర్తినగర్: 91548 46719

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఆశ వర్కర్లపై ఏఎన్ఎంల వేధింపులు తగదు

కాజులూరు: కాజులూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శలపాక సబ్‌సెంటర్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎం పంపన రామకృష్ణవేణి అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్ అనంతలక్ష్మి, విజయలక్ష్మిలపై వేధింపులకు గురిచేస్తూ అసభ్యకర పదజాలంతో వేధిస్తున్నట్లు జిల్లా ఆశవర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, చంద్రమల్ల పద్మ పేర్కొన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఆశ వర్కర్లకు జీతాల బిల్లు పెట్టకుండా వేధిస్తుందన్నారు. ఈ ఆందోళనలో లంక దుర్గాదేవి, పి.వెంకటలక్ష్మి, ఎం.దుర్గాదేవి, కే.విజయసురేఖ, బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

తాళ్లరేవు: తాళ్లరేవులో మండల సమావేశం తెదేపా మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. 15న ఉపాధి హామీ పథకం నిధులు రూ.3.80 కోట్లతో అభివృద్ధి పనులకు సుంకరపాలెం నుంచి చొల్లంగి వరకు ఎమ్మెల్యే బుచ్చిబాబు భూమి పూజ చేస్తారని తెలిపారు. టేకుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ


రవికుమార్

కొత్తపల్లి: యు.కొత్తపల్లి మండలం ఎంపీడీవోగా పి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్తు, ఉపాధిహామీ, విద్యాశాఖ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవికుమార్ అన్నారు. తుని నుంచి బదిలీపై ఇక్కడ వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పనిచేసిన వెంకటనారాయణ కోటనందూరు మండలం బదిలీ అయ్యారు. అధికారులు వెంకటనారాయణను సత్కరించి వీడ్కోలు పలికారు.


అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు

పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

సర్పవరం జంక్షన్: రానున్న ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. కాకినాడ బోటుక్లబ్ వద్ద కృషి భవన్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గం కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నడక ప్రాంతంలో పిచ్చి మొక్కలు

సమస్య: పెద్దాపురం జీవిత బీమా సంస్థ కార్యాలయం ఎదురు ఉన్న నడక ప్రాంతంలో పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిపోయాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కాలనీవాసులు వచ్చి నడక చేస్తారు. శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

- నూకరాజు, పెద్దాపురం

సమాధానం: కార్మికులను పంపి పిచ్చి మొక్కలు తొలగింపు చర్యలు తీసుకుంటాం.

- కేవీ పద్మావతి, కమిషనర్

- న్యూస్‌టుడే, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

రహదారిపై వ్యాపారం.. దినదిన గండం

● రెండు నెలల క్రితం అమినాబాదు మార్కెట్ సెంటర్‌లో ఓ వాహనం వేగంగా వచ్చి అదుపుతప్పింది. ఆ సమయంలో మార్కెట్ నిర్వహణ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది.

● మూలపేటలోని మూలపేటలో ఈ నెల 7న ఓ కారు వేగంగా దూసుకొచ్చి రహదారి వెంట వ్యాపారాలు సాగిస్తున్నవారిపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

యు.కొత్తపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో మార్కెట్ల నిర్వహణ రహదారి వెంట ఉండటంతో వాహనాల రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మత్స్యకార మహిళలు దారిని ఆనుకుని చేపల విక్రయాలు చేస్తున్నారు. అమినాబాదు, మూలపేట, కొనపాపపేటల్లో మార్కెట్ల నిర్వహణ ఇలాగే సాగుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో నిరంతరం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఉదయం, సాయంత్రం పాఠశాల, కళాశాలల బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుని విద్యార్థులు ఇబ్బంది పడుతుంటారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.


అమినాబాదులో రహదారిని ఆనుకుని చేపల మార్కెట్


మూలపేటలో నిరుపయోగంగా చేపల విక్రయాలకోసం నిర్మించిన షెడ్డు

నిరుపయోగంగా షెడ్లు

అమినాబాదు, మూలపేటల్లో మార్కెట్లు ప్రధానమైనవి. ఈ మార్కెట్ల నిర్వహణకు ప్రత్యేకంగా షెడ్లున్నా.. వాటిలో కాకుండా దారుల పక్కనే విక్రయాలు చేస్తున్నారు. దాంతో రూ.లక్షలు వెచ్చించి మార్కెట్ నిర్వహణకోసం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

షెడ్లలోకి తరలిస్తాం

అమినాబాదు, మూలపేట మార్కెట్‌లను షెడ్లలోకి తరలిస్తాం. తక్షణమే సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం. రహదారి వెంట వ్యాపారాలు సాగించేవారికి అవగాహన కల్పిస్తాం.

- కర్రి హరికృష్ణసత్యరెడ్డి, ఈవోపీఆర్డీ

సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

సిబ్బంది నియామకం, ఎక్స్‌రే యూనిట్ పునరుద్ధరణ

ఈనాడు కథనానికి స్పందన

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యూనిట్ సేవలు నిలిచిపోవడంతో గత నెల 30న 'ఈనాడు'లో 'మూతపడి ఏడాది..విని యోగానికి దారేదీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించి..కలెక్టర్, డీసీహెచ్ఎస్‌లతో చర్చించారు. వారు ఆసుపత్రికి వచ్చి పరిశీలించారు. అక్కడున్నా సాంకేతిక ఇబ్బందులు తొలగించి ఎట్టకేలకు గురువారం ఎక్స్‌రే యూనిట్‌ను పునరుద్ధరించారు. వైద్యురాలు సుజాత ఆధ్వర్యంలో రోగులకు ఎక్స్‌రే సేవలు అందించారు. అదే విధంగా ఈ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్‌లను, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక జనరల్ డ్యూటీ అటెండెంట్‌ను నియమించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకూడదని సూచించారు.


ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైద్యురాలు సుజాత

విలువలుతో కూడిన వ్యక్తి రతన్ టాటా

పిఠాపురం, పెద్దాపురం: విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహోన్నతమైన వ్యక్తి రతన్ టాటా అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మరణం భారతీయులందరికీ తీరని లోటని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ సభ్యురాలు తుమ్మల పద్మజా లక్ష్మి పేర్కొన్నారు. పలువురు నివాళులు తెలిపారు.

ప్రీమియం పర్సంటేజ్ పెంచాలి

పిఠాపురం: ఎల్ఐసీ ఏజెంట్లకు ఇచ్చే ప్రీమియం పర్సంటేజ్‌ని పెంచాలని ఆ సంఘ అధ్యక్షుడు లోకారెడ్డి రామకృష్ణ డిమాండ్ చేశారు. పిఠాపురం ఎల్ఐజీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు గురువారం కూడా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాలసీ సరెండర్ పీరియడ్‌ని మూడు సంవత్సరాల నుంచి సంవత్సరానికి తగ్గించాలని కోరారు. సరెండర్ చేసిన పాలసీలో ఏజెంట్లకు వచ్చే కమిషన్‌ను తిరిగి చెల్లించాలన్నారు.

సమస్యలు గుర్తించేందుకు 24 బృందాలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలపై జిల్లా కలెక్టర్ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో సమస్యలు గుర్తించేందుకు జిల్లా అధికారులతో 24 బృందాలను ఏర్పాటుచేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, వసతి గృహాల్లో సమస్యలను జిల్లా అధికారుల బృందాలు గురువారం పరిశీలించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అధికారులకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. గొల్లప్రోలు మండలంలో 4 బృందాలు, నగర పంచాయతీలో ఒక బృందం పర్యటించింది. పర్యటన అనంతరం శాఖలవారీగా అధికారులు, సిబ్బందితో సమీక్షించి సమస్యల వివరాలతో నివేదిక రూపొందించారు. ప్రజారోగ్యశాఖ ఈఈ గంగరాజు, చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి కె.పెద్దిరాజు, జిల్లా సహకారశాఖ అధికారి జి.వెంకటకృష్ణ, విద్యాశాఖ కార్యాలయ ఏడీ నాగేశ్వరరావు, ఏపీఐఐసి జెడ్ఎం ఎ.రమణారెడ్డి, ఈవోపీఆర్డీ కుమార్, పెద్దాపురం డిప్యూటీ ఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో -2 శివప్రసాద్ పాల్గొన్నారు.


కొడవలి ఉన్నత పాఠశాలలో సమస్యలు గుర్తిస్తున్న విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు

గ్రామ కంఠం స్థలంలోకి ఎవరూ వెళ్లొద్దు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలం కట్టమూరు మెయిన్‌బజార్ ప్రాంతంలో ఉన్న గ్రామ కంఠం స్థలంలో ఎవరూ ప్రవేశించడానికి వీల్లేదని, ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని, కలెక్టర్ ఏ ఆదేశాలు ఇస్తారో ఆ ప్రకారం చర్యలు తీసుకుంటానని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పేర్కొన్నారు. గ్రామ కంఠం స్థలం సుమారు 300 గజాల్లో ఒక వర్గం గుడి నిర్మించాలని, మరో వర్గం బజార్ ఏర్పాటు చేయాలంటూ ఇరువర్గాలు గురువారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ఇరువర్గాలతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె మాట్లాడుతూ ఇక్కడ ఏమి ఏర్పాటు చేయాలో కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారన్నారు. గ్రామ కంఠం స్థలాన్ని కొందరు వీఆర్వో ద్వారా పొజిషన్ సర్టిఫికెట్ పొందారని, తర్వాత దీనిపై గ్రామంలో వివాదం వస్తుందని తిరిగి పొజిషన్ సర్టిఫికేట్‌ను వెనక్కి రప్పించి ఒరిజనల్ సర్టిఫికేట్‌ను చింపేయగా, దాని డూప్లికేట్ సర్టిఫికేట్‌తో రాజానగరంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తహసీల్దార్ నివేదిక ఇచ్చారన్నారు.

32 పాఠశాలలకు క్రీడాసామగ్రి

గొల్లప్రోలు: పిఠాపురం నియోజకవర్గంలోని 32 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు క్రీడాసామగ్రి పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలపై ఒక్కొక్క పాఠశాలకు సుమారు రూ. 25 వేలు విలువైన క్రీడాసామగ్రి కిట్లను సీఎస్ఆర్ నిధుల నుంచి సేకరించేందుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నిర్ణయించారు. ఇటీవల పవన్‌కల్యాణ్ పిఎస్ మధుసూధన్ నియోజకవర్గంలో పర్యటించి పాఠశాలల్లో క్రీడా సామగ్రి లేని విషయాన్ని గుర్తించి నివేదిక పవన్ కల్యాణ్‌కి అందించారు. దీంతో వెంటనే ఆదేశించారు. పాఠశాలలకు అందించే క్రీడాసామగ్రి నాణ్యతను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆయన పరిశీలించారు. ఈనెల 14వ తేదీన పాఠశాలలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


పాఠశాలలకు సరఫరా చేసే క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్


వరద బాధితులకు చేయూత

పెద్దాపురం, పిఠాపురం: పెద్దాపురం మండలం మర్లావ గ్రామంలో ఏలేరు వరదల వల్ల ఇళ్లు కోల్పోయిన 12 కుటుంబాలకు పాండవగిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సేకరించిన ఆర్థిక సహాయాన్ని (ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 వేలు) గురువారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా అందించారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి వడ్డీ సత్యనారాయణ, యాసలపు మహేష్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం తమ సంఘం సభ్యులు ప్రజల నుంచి సుమారు రూ. 60 వేలు వసూలు చేశారన్నారు. సర్పంచి తోట రామకృష్ణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, ఎలిశెట్టి నాని, సీఐటీయూ మండల కార్యదర్శి క్రాంతికుమార్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలం శ్రీను, వల్లపు సూరిబాబు, కరణం అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. * జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌ని గురువారం పిఠాపురం జనసేన కార్యాలయంలో ఆర్మీ మాజీ ఉద్యోగ సంఘ నాయకులు కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.25వేలు చెక్‌ను అందజేశారు.


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం వాకలపూడి ఉమా మనోవికాస కేంద్రంలో గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. న్యాయవాది వసంత పలు అంశాలపై అవగాహన కల్పించారు. నారాయణ రెడ్డి, న్యాయవాదులు రాజశేఖర్, వీఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.


పెద్దాపురప్పాడులో ఉమాపార్వతి


కాండ్రకోట నూకాలమ్మ


తాటిపర్తిలో రుద్రాక్షమాలలతో..


దుర్గాడ శివాలయంలో పసుపుతో అభిషేకం


రాపర్తిలో రూ.15లక్షలతో అలంకరణ

సిరులీయవమ్మ.. శ్రీ కల్పవల్లీ..


బాలాత్రిపుర సుందరి

- న్యూస్‌టుడే, బృందం: పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణం నియోజకవర్గాల్లో, పెదపూడి, తాళ్లరేవు, కాజులూరు మండలాల్లో గురువారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సిరులీయవమ్మ..శ్రీ కల్పవల్లీ.. పాహిమాం దేవీ జగజ్జననీ అంటూ భక్తిశ్రద్ధలతో మహిళలు కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.


శ్రీ పీఠంలో పూజల్లో పాల్గొన్న బుజ్జాయి


పి.రాయవరంలో బోనాల సంబరం


కాకినాడ శ్రీ పీఠంలో అరుణ వర్ణం చీరలతో వచ్చిన మహిళలు


గొల్లప్రోలులో చండీ హోమం

శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

తాళ్లరేవు: ఇరు పక్షాలు సమస్యను శాంతియుతంగా పరిష్కారం చేసుకోవాలని తాళ్లరేవు ఉపతహసీల్దారు సూరిబాబు అన్నారు. రెండు రోజుల కిందట సుంకటరేవులో గ్యాస్ ట్యాపింగ్ పాయింట్ వద్ద ఆందోళనకారులు నిరసన చేపట్టిన విషయం విదితమే. దీనిపై తాళ్లరేవు రెవెన్యూ కార్యాలయంలో పీఐఎల్ కంపెనీ ప్రతినిధి ధర్మారావు, సర్పంచి వెంటపల్లి నూకరాజు, జక్కల ప్రసాదబాబు, వడ్లమూరి సతీష్, నిమ్మకాయల మూర్తిలతో ఉపతహసీల్దారు, ఆర్ఐ రామకృష్ణ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 17న సంస్థల నిర్వాహకులు, ఆందోళనకారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఉప తహసీల్దారు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

కాజులూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. మండలంలోని పెనుమళ్ల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్.ఇందిర ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రూ.10 వేలు నగదు అందజేశారు. రెవెన్యూ అధికారులు రూ.5 వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు. డేగల వెంకట సతీష్ నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులకు 16న భూమి పూజ

గొల్లప్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి పనులకు ఈనెల 16, 19 తేదీల్లో భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వప్న తెలిపారు. మండలంలో 35 అభివృద్ధి పనులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాలను విస్తరణాధికారి, మండల ఇంజనీరు, ఏపీవో స్వయంగా పర్యవేక్షిస్తారని వివరించారు.

అవీ ఇవీ అన్నీ

ప్రారంభమైన చెత్త తరలింపు పనులు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని డంపింగ్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు జిల్లా కలెక్టరు ఆదేశాలపై నగర పంచాయతీ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీ పక్కన, నివాస గృహాల మధ్యలో డంపింగ్‌యార్డ్ ఉండటంతో దుర్వాసన, తరచూ పొగతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు, జిల్లాకలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో డంపింగ్‌యార్డ్‌లో ఉన్న చెత్తను పూర్తిగా తొలగించడంతోపాటు శివారున మరో యార్డ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామశివారున ఏర్పాటు చేయనున్న స్థలంలో చెత్తను తరలించే పనులు చేపడతామని నగర పంచాయతీ ఏఈ ప్రభాకరరావు తెలిపారు.

ఎక్సైజ్ నార్త్ స్టేషన్ పరిధిలో 302 దరఖాస్తులు

సర్పవరం జంక్షన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ కాకినాడ సౌత్ పరిధిలో మద్యం దుకాణాలకు గురువారం వరకు 302 దరఖాస్తులు స్వీకరించామని సీఐ టి.నిరంజన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

కరప: కరపమండలం ఉప్పలంక వై.జంక్షన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కరప పోలీసులు తెలిపారు. ఎస్సై టి.సునీత తెలిపిన వివరాల మేరకు.. యానాంకు చెందిన శ్రీదేవి తన కుమార్తె లక్ష్మీతులసి, మనవరాలితో కలిసి ఆటోలో సామర్లకోట మండలం మాధవపట్నంలో ఉంటున్న బంధువుల ఇంటికి బుధవారం రాత్రి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో కరపమండలం ఉప్పలంక వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి తోపుడు బండి అడ్డు రావడంతో ఆటోడ్రైవర్ ఒక్కసారిగా సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో ఆటోలో ఉన్న శ్రీదేవి, లక్ష్మీతులసికి గాయాలయ్యాయి. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

మసీదుసెంటర్(కాకినాడ): ఓ కార్ల వాష్ షోరూమ్‌లో ప్రమాదవశాత్తు కారు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం కాకినాడ గ్రామీణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్‌కు చెందిన యాకుబ్ (20) కాకినాడ గ్రామీణంలోని కార్లు శుభ్రం చేసే ఓ వాష్ షోరూంలో పనిచేస్తున్నాడు. పనిలో ఉండగా ప్రమాదవశాత్తు ఓ కారు ఢీకొంది. తీవ్రగాయాలవ్వడంతో చికిత్సనిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు.

తుని
• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు డయల్ యువర్ డీఎం

తుని పట్టణం: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ తుని డిపో డీఎం కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రయాణికులు 7382781490కు ఫోన్ చేయాలని కోరారు.

18న మెగా జాబ్‌మేళా

తుని: పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో 18న వికాస ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దివ్య తెలిపారు. తేటగుంట కార్యాలయంలో గురువారం జాబ్‌మేళాకు సంబంధించిన గోడపత్రికను మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. వికాస మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ పవన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శిరామకృష్ణ, గంట్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

తుని: పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా స్వామివారు గురువారం చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక లక్ష తులసి పూజ, స్వామివారి కల్యాణం, కోలాటం, చోరోత్సవ కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



తునిలో చందన అలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామివారు

వ్యర్థాల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మల్లిసాలలో రోడ్లపై వ్యర్థాలను తొలగించారు. ఈనెల 9న 'పల్లెదారులు వ్యర్థాలమయం' అంటూ ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి శేషగిరిరావు పారిశుద్ధ్య సిబ్బందిని సమకూర్చి గ్రామానికి ఇరువైపులా ఉన్న చెత్తపోగులను తొలగించే పనులను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా



దోమల నివారణ మందు పిచికారీ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పరిశుభ్రతను పాటించడంతోనే వ్యాధులు దూరంగా ఉంచవచ్చునని ఈవోపీఆర్డీ కే.వీ. సూర్యనారాయణ అన్నారు. తిరుమలి గ్రామంలో గురువారం దోమల నిర్మూలనకు ఉపకరించే మందును పిచికారీ చేయించారు. పంచాయతీ కార్యదర్శి కె.ఉషారాణి, హెల్త్ అసిస్టెంట్ బీవీ రాజేంద్రప్రసాద్, డి.రాజు తదితరులు ఉన్నారు.

స్పందనకు సంపూర్ణం

వీధులన్నీ శుభ్రం

కిర్లంపూడి: దసరా దృష్ట్యా కిర్లంపూడిలో రోడ్లను శుభ్రం చేశారు. పండుగ వేళ రోడ్ల చెత్త, వ్యర్థాలతో ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపారు. సమస్యను సర్పంచి మహేంద్రాడ శ్రీలత, ఉపసర్పంచి గౌతు జగన్నాధం దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి సిబ్బందితో వీధులను శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

కరుణించమ్మా.. దుర్గమ్మ



సరస్వతీ దేవిగా లోవ తలుపులమ్మ



ఏవీనగరంలో దుర్గాదేవి అలంకరణ..



తునిలో కాళికాదేవిగా..



రౌతులపూడిలో..



వనదుర్గ అమ్మవారు

న్యూస్‌టుడే బృందం: తుని పట్టణం బెల్లపువీధిలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కాళికాదేవి అలంకరణలో అమ్మవారు గురువారం దర్శనమిచ్చారు. రాజీవ్‌గృహకల్పలో దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. ● రౌతులపూడిలోని అమ్మవారి ఆలయానికి సత్యదేవా కాలనీ వాసులు సారెను తీసుకెళ్లారు. దుర్గాదేవి అమ్మవారిని గురువారం ఎమ్మెల్యే సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు వేర్వేరుగా దర్శించుకున్నారు. దుర్గాదేవి అమ్మవారిని మండపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ● తొండంగి మండలం ఏవీనగరంలో కొలువైఉన్న శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు గురువారం దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ● ఏలేశ్వరంలోని సంతోషి నగర్‌లో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మకు గురువారం బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన 600 మంది మహిళలు బోనాలను శిరస్సున పెట్టుకుని పలు వీధుల్లో ప్రదర్శనగా వచ్చారు. కౌన్సిలర్ మూది నారాయణస్వామి, నిర్వాహకులు పాల్గొన్నారు. ● తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో అమ్మవారిని వేదపండితులు కనకదుర్గ రూపంలో అలంకరించి పూజలు చేశారు. ● సీతంపేట దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే సత్యప్రభ పూజల్లో పాల్గొన్నారు. వెన్నా ఈశ్వరుడు, పర్వత సురేష్, కీర్తి సుభాష్ పాల్గొన్నారు. ● అన్నవరంలో సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు భక్తులకు కనకదుర్గ అలంకరణలో గురువారం దర్శనమిచ్చారు. ● రామచంద్రపురంలో కనకదుర్గమ్మవారికి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ● జగ్గంపేట గ్రామీణంలో చెందిన చల్లా గంగ సత్యవతి దంపతులు మూడు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ● ఇర్రిపాకలో జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఇంటి చండీయాగంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారు దుర్గాదేవిగా అలంకరణలో నవీన్ దంపతులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం నివాసం వద్ద భవాని భక్తులకు అన్నదానం, ప్రసాదం అందించారు. ఎమ్మెల్యే నెహ్రూ దంపతులు, కుటుంబసభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు లోవలో కుంకుమార్చన

తుని గ్రామీణం: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11, 12 తేదీల్లో తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.



ఏలేశ్వరంలో బోనాలతో మహిళల ప్రదర్శన



అమ్మవారికి సారె తీసుకెళుతున్న సత్యదేవాకాలనీ వాసులు



సీతంపేటలో ఎమ్మెల్యే సత్యప్రభ



రామచంద్రపురంలో రమేష్



యాగంలో నవీన్ దంపతులు

మద్యం పాలసీని పకడ్బందీగా అమలు చేయాలి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన నూతన మద్యం పాలసీని సమర్థవంతంగా అమలు చేయాలని ఎక్సైజ్‌శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులకు ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ చైతన్యమురళి, ఏసీ రేణుక, ఎఈఎస్ మౌనిక తదితరులు గురువారం తేటగంట పార్టీ కార్యాలయంలో ఆమెను, మాజీ మంత్రి యనమలను కలిశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఎమ్మెల్యే దివ్యను కలిసిన ఉమ్మడి జిల్లా అధికారులు

● అభ్యర్థులపై రాజకీయ ఒత్తిళ్లు లేవు

మద్యం దుకాణాలకు టెండర్లు వేసే వారిపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆపోహలు వ్యాప్తి చెందుతున్నాయని అలాంటి చర్యలు తుని ప్రాంతంలో లేవని తుని స్టేషన్ ఎక్సైజ్ సీఐ వై.పట్టాభి చౌదరి తెలిపారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 11న సాయంత్రం 7 గంటల వరకు టెండర్లు వేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టెండర్లు వేయాలన్నారు. అభ్యర్థి తన దగ్గరలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్ నుంచి రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణానికైనా టెండరు వేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందని సీఐ తెలిపారు.

రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు

ప్రత్తిపాడు, తుని పట్టణం, న్యూస్‌టుడే: దేశ పారిశ్రామికాభివృద్ధికి ఎనలేని సేవలందించిన రతన్‌టాటా మహనీయుడని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను అన్నారు. రతన్‌టాటా మృతి దేశానికి తీరనిలోటు అన్నారు. ప్రత్తిపాడులో టాటా చిత్రపటానికి పీసీసీ సభ్యుడు ఆధ్వర్యంలో పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.
● పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు నివాళి అర్పిస్తూ వివిధ సంస్థలకు చెందిన పలువురు ఉద్యోగులు, పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో తుని పురవీధుల్లో గురువారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. రతన్ టాటా చిత్రంతో ఉన్న ప్లకార్డులు చేతపట్టి అమర్ రహే... అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు.



తునిలో రతన్ టాటాకు నివాళి అర్పిస్తూ ర్యాలీ

కోతకు గురవుతున్న రోడ్డును పట్టించుకోరా..?

అధికారుల పర్యవేక్షణ కొరవడి రూ.30 కోట్లతో నిర్మించిన ర.భ రోడ్డు ఛిద్రమవుతోంది. జగ్గంపేట మండల కేంద్రం నుంచి ఎనిమిది గ్రామాలను కలుపుతూ సుమారు 24 కి.మీ. మేర నిర్మించిన రోడ్డు పలుచోట్ల కోతకు గురైంది. రోడ్డు నిర్మాణ సమయంలో పంట కాలువలు ఉన్న ప్రదేశంలో పటిష్ఠపరచకపోవడంతో రోడ్డుకి ఇరుపక్కల మట్టి తొలగిపోయి కూలిపోతోంది. కాండ్రేగుల, భావవరం తదితర గ్రామాల్లో కాలువలు ఉన్న ప్రదేశంలో కూలిపోతుంది. రోడ్డు వెంబడి కాస్త మట్టి వేసి పటిష్ఠ పరిస్తే నాలుగు కాలలపాటు రోడ్డు నిలుస్తుందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, గుత్తేదారులు ఛిద్రమవుతున్న రోడ్డును పరిశీలించి పటిష్ఠపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం



కాండ్రేగుల సమీపంలో కోతకు గురవుతున్న ర.భ రోడ్డు

మానసిక ఆరోగ్యం ముఖ్యం

తుని: ప్రతి ఒక్కరూ మానసికంగా ఆరోగ్యంగా ఉండటం ముఖ్యమని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుడు కృష్ణవాసన్ సూచించారు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా ఆసుపత్రిలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడికి లోనైనప్పుడు సహాయం పొందేందుకు 14416 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఒత్తిడిని జయించేందుకు పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రదర్శన చేపట్టారు.



తునిలో వైద్యులు, సిబ్బంది ప్రదర్శన

న్యాయ అవగాహన సదస్సు

శంఖవరం: పీహెచ్‌సీ వద్ద గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ.. మానసిక రోగుల పట్ల కుటుంబసభ్యులు, వైద్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. మానసిక రోగుల చట్టాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి సత్యనారాయణ, న్యాయవాది మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక



ఏలేశ్వరం వైస్ ఛైర్‌పర్సన్ బుజ్జికి జనసేన కండువా వేస్తున్న పార్టీ ఇంఛార్జి తమ్మయ్యబాబు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ఏలేశ్వరం నగర పంచాయతీ వైస్ ఛైర్‌పర్సన్ - 2 మసిరపు బుజ్జి తన భర్త నాగేశ్వరరావుతో కలిసి గురువారం జనసేన పార్టీలో చేరారు. పట్టణంలోని చైతన్య నగర్‌లో జరిగిన సమావేశంలో వీరిరువురికి జనసేన ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో భజంతుల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

బెతేల్ చర్చిలో ఉపవాస ప్రార్థనలు

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేట బెతేల్ చర్చిలో ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ సుదర్శనరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ సంఘసభ్యులు దేవునివాక్యంలోనూ, ప్రార్థనలోనూ బలపడేందుకు బెతేల్ చర్చిలో ఏటా మూడు రోజులు ఈ ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నామని, ఈనెల 9, 10, 11 తేదీల్లో ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాస్టర్లు లాజరస్, సురేంద్రకుమార్, జాషువా పట్టాబి, గ్రేస్ విక్టర్ తదితరులు క్రైస్తవ సందేశాన్ని వినిపించారు.



ప్రార్థనల్లో పాల్గొన్న సంఘసభ్యులు

జగ్గంపేటలో జబర్దస్త్ కళాకారుల సందడి

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: దసరా సందర్భంగా గురువారం రాత్రి జగ్గంపేట శివారు చైతన్య పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో జబర్దస్త్ కళాకారులు ప్రోగ్రాం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నెహ్రూ సహకారంతో, రాజుభాయ్ ఈవెంట్ వారిచే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కళాకారులు బుల్లెట్ భాస్కర్, పటాస్ ఫైమా, నాటి నరేష్, అప్పుల అప్పారావు, తాగుబోతు రాజమౌళి తదితరులు సందడి చేశారు.



అలరిస్తున్న బుల్లితెర నటులు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● రూ.9.12 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు ● 'పల్లె పండుగ'కి సన్నాహాలు

న్యూస్‌టుడే, తుని గ్రామీణం

గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం గతంలో ఏర్పాటు చసిన గ్రామ సభలో గుర్తించిన సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. ఈ నేపథ్యంలో అయిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులను మెరుగుపర్చనున్నారు. ఈ నెల 14 నుంచి ప్రభుత్వం 'పల్లెపండగ' నిర్వహిస్తోంది. తుని నియోజకవర్గంలో కోట్లు వెచ్చించి గ్రామాల్లో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

నియోజకవర్గంలో 393 పనులు

తుని నియోజకవర్గంలోని ఉన్న 54 పంచాయతీల్లో నిరాదరణకు గురైన అంతర్గత రహదార్లు నిర్మాణ పనులు ఉపాధి హామీ నిధులు వెచ్చించి చేపట్టనున్నారు. తుని మండల పరిధిలో 68 పనులకు గాను రూ.3.93 కోట్లు, తొండంగిలో 66 పనులకు గాను రూ.3.99 కోట్లు, కోటనందూరు మండల పరిధిలోని 33 పనులకు గాను రూ.1.19 కోట్లు నిధులు వెచ్చించి సీసీ రోడ్డు, కాలువలు చేపట్టేందుకు ఉపాధి హామీ, మండల పరిషత్తు అధికారులు రంగం సిద్ధం చేశారు. 'పల్లెపండుగ'లో ఈ పనులు ప్రారంభించనున్నామని ఉపాధి హామీ ఏపీవో నారాయణరావు తెలిపారు.



తాళ్లూరులో కంకరరాళ్లుతో నిండిన రహదారి



హంసవరం సమీపంలో గుంతలతో నిండిన రోడ్డు

పురపాలక ఉద్యోగిపై ఫిర్యాదు

తుని, న్యూస్‌టుడే: కార్యాలయంలో దుర్భాషలాడి, గొడవ చేస్తున్న వాటర్ వర్క్స్ ఉద్యోగి సుల్తాన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. వీరవరపుపేటలో బుధవారం ఇంటిని కూలగొట్టేందుకు వెళ్లిన సందర్భంలో జరిగిన వివాదంపై రమణమ్మ భర్త సుల్తాన్ (పురపాలక ఉద్యోగి) గురువారం ఉదయం కార్యాలయంలో తన ముందే డీఈతో మళ్లీ వాగ్వాదానికి దిగాడన్నారు. ఈనేపథ్యంలో ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. దీంతో పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ సిబ్బందితో వచ్చి సదరు ఉద్యోగిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలావుండగా తన భర్తను పురపాలక కార్యాలయంలో డీఈ, ఇతరులు దాడి చేశారని, పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని రమణమ్మ, కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపారు. పాతికేళ్లుగా తన భర్త పురపాలక కార్యాలయంలో పనిచేస్తున్నారని ఈ విధంగా తోటి ఉద్యోగులే దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకూ వెళ్లేది లేదని మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ స్టేషన్ ముందే నిరసన తెలిపారు. దీనిపై సీఐ గీతా రామకృష్ణను వివరణ కోరగా పురపాలక కమిషనర్ ఫిర్యాదు మేరకు సదరు ఉద్యోగిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. ఇంటికి వెళ్లిపోవాలని సూచించినా వెళ్లకుండా స్టేషన్ వద్ద ఆందోళనకు దిగడం సరికాదన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్యోగి కుటుంబ సభ్యుల నిరసన

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరకు జరిమానా

కిర్లంపూడి, న్యూస్‌టుడే : ఏలేరు ప్రధాన కాలువలో అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తున్న శృంగరాయుని పాలెం గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టరును పట్టుకుని రూ.పదివేలు జరిమానా విధించినట్లు కిర్లంపూడి తహసీల్దారు జె.చిరంజీవి తెలిపారు. కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు శృంగరాయునిపాలెం గ్రామానికి చెందిన పిల్లి నూకరాజు చెందిన ట్రాక్టరు ఏలేరు బెడ్ రెగ్యులేటరు సమీపంలో ఇసుక తవ్వి తరలిస్తుండగా బుధవారం శృంగరాయునిపాలెం రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, వీఆర్వోలు, కానిస్టేబుల్ పట్టుకున్నారు. దీనిపై కేసునమోదుచేసిన పోలీసులు కిర్లంపూడి తహసీల్దారు కోర్టులో హాజరుపరచగా రూ.10వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. మరోసారి అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడితే రూ.20 వేలు జరిమానా విధిస్తామని తహసీల్దారు హెచ్చరించారు.

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

కిర్లంపూడి: గ్రామాల్లో నరేగా ద్వారా 2023-24ల్లో ఖర్చుచేసిన రూ.9.83 కోట్ల ఖర్చుకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని ఎంపీపీ తోట రవి తెలిపారు. కిర్లంపూడి మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి పనులకు సంబంధించి జరగనున్న సామాజిక తనిఖీ నివేదిక గ్రామ సభల సమన్వయ సమావేశాన్ని బుధవారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన నిర్వహించారు. గతేడాదిలో మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ కింద ఖర్చులను ఎంపీడీవో సి.హరికృష్ణ వివరించారు. రూ.7.34 కోట్లను కూలీలకు వేతనాలుగా, రూ.2.49 కోట్లను వివిధ పనులు చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించి గ్రామాల వారీగా ఖర్చుచేసిన వివరాలపై గ్రామ సభలు పెట్టి ప్రజలనుంచి వివరాలు సేకరిస్తామని సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్సుపర్సన్ సింహాద్రి తెలిపారు. ఈనెల 12 నుంచి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు మండల ఏపీవో ఏబీవీ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో తోట గాంధీ, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద 16న నంబరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్.రాయవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ నాన్‌స్టాప్ బస్సు 36 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. పెనుగొల్లు వద్ద ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరానికి చెందిన బస్సు డ్రైవర్ ఎం.తాతాజీ, విశాఖపట్నానికి చెందిన ఐ.ఎస్.ఎన్.రాజు, ఒడిశాకు చెందిన కె.చంద్ర సబత్, రంజన్ పంగి తలకు గాయాలయ్యాయి. కాకినాడకు చెందిన రత్నకుమార్, వరప్రసాద్, వైజాగ్‌కు చెందిన మురళీకృష్ణ, నూకరత్నం, ఉమామహేశ్వరి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని నక్కపల్లి సామాజిక ఆసుపత్రి, పెనుగొల్లు ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖకు తరలించారు. రోడ్డు మధ్యలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.



ప్రమాదానికి గురైన వాహనం

సెలవుల్లో ఇంటర్న్‌షిప్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఒకేషనల్ విద్యలో భాగంగా ప్రత్తిపాడు హైస్కూలు విద్యార్థులు ఆటోమోటివ్ ట్రేడ్‌ను అభ్యసిస్తున్నారు. పదోతరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులు 12 రోజులు సాగే కార్యశాలలో నిమగ్నమయ్యారు. చదువుతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను ఒంటపట్టించుకునేందుకు ఇంటర్న్‌షిప్ దోహదపడుతోంది. సెలవులను తమ ఆసక్తి మేరకు ఇంటర్న్‌షిప్‌కు వెచ్చిస్తున్నారు. విద్యార్థులు ప్రత్తిపాడులోని ఆటోమోబైల్ షోరూంలో వాహనాల నిర్మాణశైలిని, ఇంజిన్ల పనితీరును అధ్యయనం చేశారు. వీరికి ఒకేషనల్ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ మార్గదర్శనం చేశారు.



వాహనం నిర్మాణ శైలి పరిశీలిస్తున్న విద్యార్థులు

నలుగురు జూదరుల అరెస్టు

గండేపల్లి: నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సూరంపాలెం గ్రామ శివారును గురువారం రాత్రి జూదం ఆడుతున్నారనే సమాచారంతో చేసిన దాడిలో నలుగురు జూదరులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.4,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.